# వైశాఖి మేఘం

"లోపలికి రావచ్చునా?"

"రండి."

ఆ ఇద్దరూ గదిలోకి రాగానే వారిని కూర్చోమని చెప్పి, ఆమె మళ్ళీ వ్రాతలో నిమగ్న మయింది. ఒక్క క్షణం తరవాత నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ ఆ ఇద్దరిలో ఒకరు-"అరుంధతి గారూ! మీ సహాయాన్ని అర్థిస్తూ వచ్చాము" అన్నారు.

"తప్పకుండా చేస్తాను, నా వలన అయితే."

మళ్ళీ ఆయన-"ఈయన వరంథామ్‌గారు... ఉస్మానియాలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ పొందారు. ఇక్కడ ఆర్గనైజేషనల్ బిహేవియర్‌లో ఫెలోగా సెలెక్ట్ అయ్యారు. మీరు అందులోనే థీసిస్ రాస్తున్నారు కాబట్టి, ఏమైనా సలహా లిస్తారని."

"తప్పకుండా, వెంకట్‌గారు! చాలా సంతోషంగా ఉంది. ఒక ఇంజనీర్‌ది థీసిస్ అయిపోగానే, ఇంకో ఇంజనీర్ వచ్చి చేరారు. ఇంతకూ వరంథామ్ గారికి మానసిక శాస్త్రం మీద మక్కువ ఎందుకు కల్గిందో!" అంటూ నవ్వింది.

వరంథామ్‌గారు-"మక్కువ లాంటి దేమీ లేదు. ఉద్యోగాలు ఎక్కడ బాగా దొరికితే దాని వెంబడి పడడమే."

"చాలా బాగా చెప్పారు. ఇంతకూ అహ్మదాబాద్ ఎలా ఉంది?"


"చాలా ఉక్కగా ఉంది."

"మన విజయవాడ కన్నానా? నేను కాలేజిలో చదివే రోజుల్లో ఉక్కకు భరించలేక చచ్చిపోయేదన్ని. అహ్మదాబాద్‌లో ఐ. ఐ. ఎమ్.లో చేరాక ఫర్వాలే దనిపిస్తున్నది. మీరు హైదరాబాద్ నుండి వచ్చారు కదా... అందుకే అలా ఉంది."

"సంతోషం. మన తెలుగువాళ్ళు అహ్మదాబాదలో, ఈ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో చాలామంది ఉన్నారా?"

"ఓహ్. చాలామంది ఉన్నారు. వాళ్ళందరిని పరిచయం చేస్తాను. మీరు ఆంధ్రాలో ఉన్నట్లే భావిస్తారు."

"అచ్చా! హైదరాబాద్‌లోలా ఉంటుందా?"



మెతుకు మనోహరరెడ్డి

పేధ్యలోనే వెంకట్ కల్పించుకొని, "నేను కంప్యూటర్ సెంటర్‌కు వెళ్ళాలి. మళ్ళీ వీలుంటే సాయంత్రం కలుస్తాను. వీడు చాలా సిగ్గుపడతాడు. మా కాలేజి రోజుల్నుంచీ ఇంకా మారలేదు. వీణ్ణి మన తెలుగు వాళ్ళతో కలపండి" అంటూ వెళ్ళిపోయాడు.

ఆయన వెళ్ళిపోగానే అరుంధతి అన్నది-"నేను ఇంకో సంవత్సరం ఇక్కడ ఒంటరిగా ఉండాల్సి ఉంది."

"అంటే...తరవాత పెళ్ళి చేసుకో బోతున్నారన్న మాటా!"

"కాదు. తరవాత మళ్ళీ బందరు వెళ్ళిపోతాను. మన ఆంధ్రాలోనే ఎక్కడన్నా జాబ్‌లో చేరతాను."

"రిట్రీట్‌కు వెళ్దామా? కాఫీ త్రాగాలని జిహ్వకు చాపల్యం ఎక్కువయింది."

"మీరు చాయ్ త్రాగుతారు కదా, హైదరాబాదులో!"

"అలాంటి దేమీ లేదు."

అరుంధతి అన్నీ సర్దివేసి గదికి తాళం వేసింది. ఇద్దరూ రిట్రీట్ వెళ్ళారు. కాఫీ త్రాగుతుండగా అరుంధతిని దూరంనుండి చూసి, నవ్వుతూ ఓ యువతి వచ్చి, పరంధామ్ ఎవరు అన్నట్లుగా అరుంధతి కేసి ప్రశ్నార్థకంగా చూసింది.

అరుంధతి ఆయన్ని ఆమెకు పరిచయం చేస్తూ-"మన తెలుగువాడు. ఇక్కడే ఫెలోగా చేరారు. మనం ఆంధ్రాలో ఉన్నట్లే అనుకుంటున్నాం... రోజూ మన దగ్గర నుండి ఇలా వచ్చి ఇక్కడ మనవాళ్ళు చేరుతుంటే."

"నా పేరు మందాకిని. మాది కాకినాడ. ఆంధ్రా యూనివర్శిటీలో ఆంధ్రా పొలజిలో ఎమ్. ఎ. చేశాను. అమెరికా ప్రిన్స్‌టన్ యూనివర్శిటీలో జనాభా సమస్య మీద రెండు సంవత్సరాల డిప్లొమా పొందాను.. ఇక్కడే రీ సెర్చి అసోసియేట్‌గా చేస్తున్నాను ఆరునెలల నుంచి" అంటూ గ్రుక్క త్రిప్పుకోకుండా చెప్పేసింది గ్రామ్‌ఫోన్ రికార్డులా. మళ్ళీ ఆవిడే-"ఎప్పుడు వచ్చారు, అహ్మదాబాద్ ఎలా ఉంది?" అని అడిగింది.

"వారం రోజులయింది వచ్చి. ఈ ఇన్‌స్టిట్యూట్ భవనం చాలా నచ్చింది. అన్నింటికన్నా ఈ భవనం పేరు...'లూయిస్ ఖాన్ ప్లాజా' ఎంత బావుందో పేరు. లోతలు, కాళీభంగన్‌లో దొరికిన బొమ్మల్లాంటి విగ్రహాలు గార్డెన్‌లో బహు చక్కగా ఉంచారు."

"ఇంకా ఏం నచ్చాయి?"

"అహ్మదాబాద్‌లో ఎక్కడ చూచినా గాడిదలు."

"మీకు గాడిదల మీద దృష్టి ఎందుకు పడిందో?" నవ్వుతూ అంది మందాకిని.

"బహుశా నా మనస్సు బలహీనుల గురించి ఆలోచించడానికి ప్రయత్నిస్తుండడం వల్లనేమో!"

"నాకూ అలానే ఉంటుంది. నే నెక్కడికి వెళ్ళినా, ఊరపిచ్చుకలనే గమనిస్తాను."

"మీది అతి సున్నితమయిన మల్లెపూవు లాంటి మనస్సు. మీ అందానికి పరిమళం తెచ్చేది అదే."

"ఇంతకూ నే నిక్కడున్న సంగతి మీరు మరిచిపోయారా!" అరుంధతి అన్నది.

పరంధామ్ చిరునవ్వు నవ్వుతూ మందాకిని కేసి చూశాడు, కన్నులు వాల్చకుండా తదేకంగా. ఆమెకు స్త్రీ సహజమయిన సిగ్గు ఆవహించింది. పరంధామ్ మనస్సులో అనుకున్నాడు-ఎక్కడి కాకినాడ-కోనసీమ, ఎక్కడి అహ్మదాబాద్! ఈవిడను అల్లసాని పెద్దన గనుక చూస్తే పెద్ద కావ్యం వ్రాసేవాడు.

మందాకిని అడిగింది-"ఏ విషయంమీద థీసిస్ రాయాలనుకున్నారు."

"ప్రజాస్వామ్య రక్షణ-పార్టీల మార్పిడులు-ఎమ్. ఎల్. ఎ. ల జీవన విధానం ప్రజలపై ప్రభావం."

"ఎంత పెద్ద సబ్జక్టును తీసుకున్నారు?"

"నాలాగా మీరు కష్టపడాల్సి ఉంటుంది. నేను అలాంటిదే ఎన్నుకొని మూడు సంవత్సరాల నుంచి తిరగని ప్రదేశం, త్రాగని నీళ్ళు లేవు" అని అంది అరుంధతి.

"మీరు దేన్ని గురించి వ్రాస్తున్నారు?"

"ఐ. ఎ. ఎస్. ఆఫీసర్లు-జీవన విధానం-ప్రజలపై ప్రభావం! మొత్తాని కిప్పుడు ఓ కొలిక్కి వచ్చింది."

"భోజనానికి వెళ్దామా?" అన్నాడు.

సరేనని ముగ్గురూ నడిచారు. సరిగ్గా డైనింగ్ హాల్ అప్పుడే తెరచారు. మందాకిని టిక్కెట్లు కొన్నది. ముగ్గురూ క్యూలో నిలబడ్డారు. చపాతీలు, శనగలకూర, సాంబార్, పెరుగు తీసుకొని ఓ మూలకు కూర్చున్నారు. మంచినీళ్ళు పరంధామ్ తెచ్చాడు. భోజనాల కుపక్రమిస్తూ, "మీరు గడ్డాన్ని



daCunha/AS/27/84/TL

20-2-85

ఎందుకు పెంచుతున్నారు?" అని మందాకిని అడిగింది మెల్లిగా.

"చెప్పాలా?"

"బహుశా వేదాంతమయినా ఒంటబట్టి ఉండలి, లేక భార్యా బాధితుడయినా కావాలి?" అంటూ నవ్వింది మందాకిని.

"మీకెలా తెలును?"

"ఏమిటి?"

"నేను వేదాంతినని లేక భార్యా బాధితుడినని."

"మీ మాటలను, ముఖ కవళికలను బట్టి!"

"ఇంతకూ మీకు పెళ్ళయిందా?" అరుంధతి మధ్యలో కల్పించుకుంటూ అడిగింది.

"ఎందుకు? మీ రేమయిన పెళ్ళిళ్ళ పేరమ్మలాంటి పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నారా? అయినా, నా గురించి ఇంత ఊహించిన వాళ్ళు..."

"మాకు అనుమానంగా ఉన్నది. పెళ్ళయితే ఇంత అప్యాయంగా ఈ తిండిని తినేవారు కారు" అని అరుంధతి అన్నది.

"ఆవకాయ, గోంగూర, గడ్డ పెరుగు తిని ఎన్నాళ్ళయిందో?! ఈ కాంటీన్‌లో తింటూ బక్కచిక్కిపోతున్నాను."

"లేదు. చాలా నాజూకుగా సినీమా తారలా ఉన్నారు."

"అయితే, మీకు ఈ సెనగల కూర నచ్చిందా? ఈ చపాతీలను, ఉల్లిపాయను, పచ్చిమిరపకాయను కొరుకుతూ తింటే బాగుందా? నాకు మళ్ళీ మా అమ్మా, నాన్న దగ్గరకు వెళ్ళాలనిపిస్తోంది; కోనసీమ కొబ్బరిపచ్చడి తినాలనిపిస్తోంది."

"ఇంత మంచి తిండి తింటూ, ఇన్ని స్వర్గభోగాలనుభవిస్తూ మీ రిలా ఆలోచిస్తుంటే నాకు జాలిగా ఉంది మీ మీద. రోజుకు ఒక్క పూట గంజినీళ్ళు లేనివాళ్ళు మనదేశంలో నూటికి అరవైమంది ఉన్నారు. వాళ్ళను గురించి ఒక్కసారైనా గుర్తు చేసుకుంటే మీరు హాయిగా తింటారు."

"అయ్యో! నే నేమయినా తప్పుగా మాట్లాడానా? అయినా, కొంపదీసి మీరు ఉగ్రవాది కాదు కదా."

"వా డెవడు?"

"అయ్యో! అదీ తెలియదా? ఎక్స్‌ట్రీమిస్ట్!"

"అలా అని అనిపిస్తుందా!"

"అవును... మీ గడ్డం, మీ మాటలు, మీ ఉద్రేకం చూసి అలానే అనిపిస్తున్నది."


"ఇందాకే అన్నారు. నేను వేదాంతినని. బలే మానసిక శాస్త్రంలో డాక్టేట్‌లు చేస్తున్నారు?" అన్నాడు. అందరూ నవ్వారు. భోజనం కాగానే కారిడార్లో నడుస్తుండగా ఇంకో గడ్డం ఆసామీ ఎదురయ్యాడు.

మందాకిని ఆయనను పరిచయం చేసింది-"అతను సుబ్బారావ్‌గారు...వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రాజకీయ శాస్త్రంలో ఎమ్. ఎ. ఫస్టుఎక్లాసులో పాసయ్యాడు. రి సెర్చ్ అసోసియేట్‌గా చేస్తున్నాడు."

సుబ్బారావ్ నవ్వుతూ అన్నాడు-"మేము ఆంధ్రా నుంచి ఇద్దరం గడ్డాలవాళ్ళం ఉన్నామంటే మూడో ఆయన కూడా వచ్చారు. మనం ఒక సంఘాన్ని స్థాపిద్దాం" అంటూ నవ్వాడు.

మొత్తానికి మళ్ళీ విజయవాడలో ఉన్నట్లు అనిపిస్తున్నది.

"ఇంకో గడ్డం ఎవరు?" అంటూ పరంధామ్ ఉత్సుకతను ఆపుకోలేక పోయాడు.




"ఆయన కవి. సౌమ్యుడు. ప్రేమపిపాసి. రంగారావ్‌గారు!"

"ఇక్కడేం చేస్తుంటారు?"

"మీరు మా రూంలో కూర్చోండి. వారిని కూడా రమ్మంటాను. ఈరోజు ఏమీ పనిలేదు. హాయిగా కబుర్లు చెప్పుకోవచ్చు. నేను భోంచేసి తొందరగా వస్తాను" అంటూ ఆయన రూం తాళపుచెవిని మందాకినికి ఇచ్చి అఘమేఘాల మీద పరిగెత్తాడు.

వాళ్ళ కెదురుగా ఒక జంట కబుర్లలో లోకాన్ని మరిచి నవ్వుతూ వచ్చింది.

మందాకిని-"ఏమండీ, రంగారావ్‌గారు! మీ గడాల సంఘానికి ఒక క్రొత్త సభ్యుడు మన తెలుగు గడ్డనుంచి వచ్చారు. ఇంతకూ 'కుంకుం' ఏమంటున్నది? మీ కవిత్వానికి బాణీలు కడ్తున్నదా? క్రొత్త కవిత్వానికి ప్రేరణ ఇస్తున్నదా?"

రంగారావ్-"ఓహ్! మీరూ ప్రేమోపహతుల్లాగా కన్పిస్తున్నారే!"

పరంధామ్-"నే నొక్కొక్కరికి ఒక్కలాగా అనిపిస్తున్నానా?"

లక్ష్మి...నిజంగా లక్ష్మీదేవిలా ఉంది. పాపట నిండా కుంకుమతో ముగ్ధ మనోహరంగా ఉంది. అందరూ ముద్దుగా 'కుంకుం' వదినా అంటారు. ఆంధ్రా యూనివర్సిటీలో ఇద్దరూ రాజకీయ శాస్త్రం ఎమ్. ఎ. లో క్లాసుమేట్లు. రంగారావ్‌గారి గడ్డాన్ని చూసి ప్రేమించి మరీ పెళ్ళి చేసుకున్నది. "సుబ్బారావ్‌గారి రూంలోకి రండి, భోంచేసిన తరవాత" అని అందరూ ఆ హంసల జోడీని ఆహ్వానించారు. వాళ్ళు ఉత్సాహం చూపెట్టారు. భోంచేసి వస్తా మన్నారు.

అందరూ సుబ్బారావ్ రూంలోకి చేరారు. సుబరావ్ ఇంతలోనే సిగరెట్టు ఊదుతూ ప్రవేశించాడు. పరంధామ్ నుద్దేశించి, "ఈరోజు నుంచి ఇంకో నాలుగు సంవత్సరాలు ఇది మన గడ్డాల సంఘానికి ఆఫీసు. నేను ప్రెసిడెంట్, మీరు జనరల్ సెక్రటరీ. రంగారావ్‌ను కోశాధికారిగా వేసే ముందు 'కుంకుం' వదినగారి పర్మిషన్ తీసుకోవాలి. సిగరెట్టు త్రాగుతారా! అయితే, మీ బ్రాండ్ ఏమిటి?"

"నేను పొగ త్రాగను!"

"పొగ కాదయ్యా... సిగరెట్టు!"

"సారీ! అలవాటు లేదు."

"పొగత్రాగనివాడు దున్నపోతయి పుట్టును."

"మేమెవరమూ త్రాగం కదా!" అడిగింది అరుంధతి.

"స్త్రీలకు వర్తించదు. ఇంతకూ పరంధామ్‌గారు త్రాగక పోవడానికి కారణమేమిటి? కొంపదీసి మీరు భార్యా బాధితులా? రంగారావ్ గారికి మా కుంకుం' వదినగారు పర్మిషన్ ఇచ్చారు- సిగరెట్లు కాల్చడానికి."

"నేను చిన్నప్పటి నుండి హాస్టల్‌లో ఉన్నాను. అయినా, ఈ అలవాటు కాలేదు."

"మరి ఏ అలవాటు అయింది?"

"చెప్పాలా? ఆలోచించడం... దేశాన్ని గురించి ఆలోచించడం అలవాటు అయింది."

"బాబూ! ఈ అహ్మదాబాద్‌లో సీరియస్‌నెస్ పనికి రాదు. ఈ నర్మదాతీరం అంతా ప్రశాంతతకు నిలయం."

మందాకిని చిరునవ్వు నవ్వింది. రంగారావ్‌గారు, లక్ష్మిగారు చేరుకున్నారు.

సుబ్బారావ్-"వదినగారూ సుస్వాగతం...మీ రాజమండ్రి విశేషా లేమిటి?"

"ఏమీ లేవు గాని, మీరు పెళ్ళెప్పుడు చేసుకుంటారు?"

"తోటలో ఎన్నో పుష్పాలున్నాయి. ఏ పూవు పైన వాలాలో తెలియడం లేదు" అంటూ మందాకిని వైపు చూశాడు.

"నిజంగా చెప్పవయ్యా?"

"లతా మంగేష్కర్‌కు పెళ్ళయిన తరవాత."

"జోకులు వద్దుగాని... మంచి అమ్మాయి ఉంది."

"అయితే, నేను కొన్నాళ్ళు స్వేచ్ఛా జీవిగా బ్రతకా లనుకుంటున్నాను. మా క్రొత్త సభ్యుడు పరంధామ్ గారిని అడగండి."

"బాబూ! మన పెళ్ళి తరవాత. ఇప్పుడు ఒక హంసల జోడీ గురించి మాట్లాడండి."

లక్ష్మి-"మాట్లాడాలంటే రోజులు, నెల లవుతయి" అంది.

రంగారావు పొగ వదులుతూ, "దసపల్లా హిల్స్, విశాఖ డాల్ఫిన్స్‌నోస్‌కు మా గురించి తెలును."

సుబ్బారావు-"మీ గురించి మాకు ఇంకా ఎక్కువే తెలును. మీరు కొల్లేరు సరస్సు మీద వ్రాసిన గేయానికి ముగ్ధురాలై, క్లాసులో మీ గడ్డాన్ని చూస్తూ కూర్చునేది. చివరకు విషాదాంతమై భార్యాభర్తలయ్యారు. ఇప్పుడు మీరు పశ్చాత్తాప పడ్తున్నారో లేదో కాని, అమ్మా, లక్ష్మిగారు! ఈ నల్లని రంగయ్యలో ఏం చూసి మోహించా వమ్మా!"

అరుంధతి మధ్యలో అందుకొని, "మా అన్నయ్య మొన్నీ మధ్య వచ్చినప్పుడు మందాకిని కోసం పడిగాపులు కాచాడు. ఎంత బెట్టు చేసిందనుకున్నారు! భగ్నహృదయుడై మళ్ళీ డ్యూటీలో జాయిన్ అయ్యారు."

"మా అన్నయ్యను నీవు పెళ్ళి చేసుకుంటే అప్పుడు ఆలోచిస్తా...మీ సంసారం ఎలా సాగుతుందో పరిశీలించిన తరవాత."

సుబ్బారావ్-"అమ్మలారా! మీ వదినా మరదళ్ళ మధ్య మేమెందుకు? వెళ్ళిపోతాం. మీరే ముచ్చటలో గడపండి. నేను పావురాల కోసం, వరంధామ్‌గారు దేశాటన కోసం, రంగారావ్‌గారు-లక్ష్మిగార్లు యుద్ధం కోసం" అన్నారు.

మందాకిని-"వద్దు...వద్దు. ఈరోజు ఉగాదిల్లాటి పర్వదినం. ఇందరం ప్రవాసాంధ్రులం ఈ నర్మదా నదీ తీరాన గుమిగూడిన సమయాన సమాలోహం ముదావహంగా సాగిద్దాం!"

"అమ్మో! ఇంత స్వచ్ఛమైన తెలుగు జీర్ణం కాదు. మనకు ఇంగ్లీష్ కలిపిన తెలుగు, ఉర్దూతో కూడిన తెలుగే వచ్చును."

"సుబ్బారావ్‌గారు! అతిథిని మనం మాట్లాడనివ్వకుండా మనమే అన్ని మాట్లాడుకుంటున్నాము. వరంధామ్‌గారు ఏమో ఆలోచిస్తున్నట్లున్నారు."

"ఏమీ లేదు... ఎక్కడుండాలా అని-హాస్టల్‌లోనా, వస్త్రపూర్‌లోనా!"

"వస్త్రపూర్‌లో ఉండండి. నేను రోజూ మిమ్మల్ని కారులో దించుతాను ఇక్కడ."

"అమ్మో! మళ్ళీ మరో జన్మ ఎత్తి మిమ్మల్ని రిక్షాలో కూర్చోబెట్టి మీ ఇంటి దగ్గర నుండి ఆఫీసుకు తేవాల్సి వస్తుంది. నన్ను రిక్షా లాగనివ్వడం భావ్యమా మీకు?"

"పోనీ, నడిచి రండి. వస్త్రపూర్ మంచి లొకాలిటీ."

"అచ్చా! మీ దగ్గఱ ప్రైవేట్ సాంగ్స్-రికార్డులున్నాయా?"

"ఏం కావాలి మీకు?"

రామస్వామి చౌదరిగారు రచించి, జనాళికి అందించిన సమరగీతం-"వీరగంధము తెచ్చినారము వీరులెవరో తెలుపుడీ పూసిపోదుము, మెడనువైతుము పూలదండలు భక్తితో' వినాలని ఉంది."

"హాయిగా వినొచ్చు. అటీరాలో నేను సభ్యురాలను. రాత్రి భోజనాల తరవాత అందరూ వెళ్దాము. ఏమంటావు, సుబ్బారావ్? ఇంకా ఎన్నయినా పాటలు వినొచ్చు. ఘంటసాల పాడిన పుష్పవిలాపము-ఇంకా ఎన్నెన్నో."

"నాకు మాత్రం లతా మంగేష్కర్ పాడిన పాటలంటే చాలా ఇష్టం. ప్యార్ కియాతో డర్‌నా క్యాజబ్-ప్యార్ కియా కోయీ చోరీ నహీకీ."

"మీరు ఇలా చెడిపోయినట్లు మీ అమ్మానాన్నకు తెలుసా?"

"వాళ్ళు నా బాధ భరించలేక గాలికి వదిలారు."

"వరంధామ్‌గారు ఎలా మౌనంగా ఉన్నారో-మీరు నేర్చుకోండి. అయినా, గడ్డాల వాళ్ళను నమ్మకూడదు" అంది లక్ష్మి.

"అందరు గడ్డాల వాళ్ళను కూడానా?" సుబ్బారావ్ అన్నాడు.

"అవును."

"అయితే రవీంద్రనాథ ఠాగూర్, మాక్సిం గోర్కీలను కూడానా!"

"మీలాంటి గడ్డం ఉన్నవాళ్ళను. మీరు అమ్మాయిల కోసం గడ్డాలు పెంచుతారు. మౌనం చేస్తారు. నా లాగా మౌనపోవాల్సి వస్తుంది."

"మాక్సిం గోర్కీని చూసి ఎందుకు అమ్మాయిలు మోసపోలేదు."

"అప్పుడు రష్యాలో చాలా 'సీరియస్'గా ఉండేది" అని లక్ష్మి అనగానే అందరు నవ్వారు.

భోజనాలకు టైమ్ అయిందని అందరూ లేచారు. భోంచేసి అటీరాకు వెళ్ళారు. అందరూ కోరిన రికార్డులను ఏరి వేయిస్తున్నారు. రాత్రి తొమ్మిది సమయంలో ఎవరో అగంతుకులు వచ్చారు.వరంధామ్‌ను బయటకు పిలిచారు. దూరంగా ఆయనతో ఏమో మాట్లాడుతున్నారు. మందాకిని రెండు నిముషాల తరవాత అక్కడికి చేరింది. వాళ్ళు ఇంకా ఇద్దరున్నారు. ఆయన్ని అక్కడికి దూరంగా నిల్చిన వాను దగ్గరకు తీసుకెళ్ళారు. మందాకిని వరంధామ్ నడిగింది-ఎటు వెళ్తున్నారని. ఏమీ సమాధానం రాకపోయేసరికి వచ్చిన వ్యక్తినే అడిగింది. ఆయ నన్నాడు-"ఈయన మీద చాలా కేసులున్నాయి. ఎక్స్‌ట్రీమిస్టు... ఈయన కోసం చాలారోజుల నుండి గాలిస్తున్నాం."

మందాకిని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఉద్వేగంతో వణికింది. ఇంతలో లక్ష్మి, అరుంధతి, సుబ్బారావ్, రంగారావ్‌లు చేరుకున్నారు.

వాళ్ళకు నిమిషం తరవాత విషయం అర్థమయింది. వాను వరంధామ్‌తో కదిలిపోయింది. మందాకిని నయనాల నుండి బాష్పాలు రాలాయి. వైశాఖమేఘం వచ్చింది. విషాదపు చినుకులు రాలయి. ★


# డాబర్ చ్యవనప్రాశ

## 3000 సంవత్సరాలనాటి మహర్షుల ఔషధం-తిరిగి సృష్టించబడింది

ప్రాచీన కాలపు మన ఋషులకు ప్రకృతి గురించిన ఎన్నో రహస్యాలు తెలుసు. ఇవి మానవ శరీరానికి ఏ విధంగా లాభదాయకమైనవో వారు ఎరుగుదురు. వీటిలో ఒకటి చ్యవనప్రాశ అన్న ప్రత్యేక తయారీ.

సుమారు 3000 సంవత్సరాల తరువాత డాబర్ ఈ మిశ్రమాన్ని డాబర్ చ్యవనప్రాశగా పునః సృష్టించారు.

తాజా ఉసిరి, దశమూలం, అష్టవర్గవంటి 40కి పైగా ప్రకృతి సిద్ధమైన దినుసులతో తయారైన డాబర్ చ్యవనప్రాశ, మీ కుటుంబంలోని వారికి అనేక రోగాలు రాకుండా తట్టుకునే శక్తిని పెంచుతుంది. వారు మంచి ఆరోగ్యంగా ఉండేటట్టు చేస్తుంది.




డాబర్ చ్యవనప్రాశ

మీ కుటుంబ ఆరోగ్యానికి ప్రకృతి సిద్ధమైన టానిక్

OBM/9487/R/TEL